# అదృష్టవంతులు

- విశ్వసాయి

'ఓల్డాన్ ఓల్డాన్' అన్న క్లీనర్ కేకతో బస్సుకి సడెన్ బ్రేక్ పడింది. అంత ముందుకు తూలాం. విశాఖపట్నంలో బస్సు ఎక్కింది మొదలు ఇదే వరస. ముక్కులు, మూతులు చచ్చుబడుతున్నాయి. అప్పటికప్పుడే చిన్న పాటి రక్తస్రావంతో వాపులు కూడాను. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా బస్సులో ఉన్నవారంతా తలో రెండు అక్షింతలు వేస్తూనే వున్నారు, డ్రైవర్ మీద.

'ఏటీ చచ్చినోడు, ఈడికి బండి నడపడం రాదా ఏటి?' ఓ ముసలమ్మ రివ్వున లేచి డ్రైవర్ మీదికి లంఘించింది. తరువాత అంకం రక్తి కట్టేలా ఉంటుందనుకొని ఆసక్తిగా ఎదురుచూస్తుంటే...

'అనాథాశ్రమం... అనాథాశ్రమం' అన్న క్లీనర్ అరుపునకు సంచి భుజాన వేసుకొని వడివడిగా కిందికి దిగాను. నా వెంట నా శ్రీమతి కూడాను. బస్సు రయ్యుమని దూసుకుపోయింది ముందుకు.

మాతోపాటు మరో ఐదుగురు కూడా దిగారు. అందులో నలుగురికి అది అలవాటైన ప్రాంతంగా ఉంది. వేడు తీస్తున్నట్టు నడుచుకు పోతున్నారు.

మిగిలింది నేను, నా శ్రీమతి. దేని కోసమో ఎదురుచూపులతో నా ప్రక్కగా మరొకతను. నా మీద ఓ పుష్కరం పెద్దయి ఉండవచ్చు.

నిర్మానుష్యంగానూ, నిర్జనంగానూ ఉందా ప్రదేశమంతా. రోడ్డు కిరువైపుల బారులు తీరి నింగిని మూసేసిన ఊడలేసిన పెద్దపెద్ద మర్రి వృక్షాలు. మాకెదురుగా చిన్న గోర్జి. దానికిరువైపులా ఒంటరాల చెట్లు, తుప్పలు. అదేం మాసమేమో, మబ్బుతెరలు సూర్యకాంతిని కప్పేసి, సన్నటి తుంపర్లను రాలుస్తున్నాయి. రాత్రి కురిసిన కుంభవృష్టికి వాతావరణం చల్లబడటంతో. వీచే గాలి కూడా చల్లటి ఈదురు గాలుల్లా అన్పిస్తోంది.

ఎటు అడుగువేయాలో నాకు అర్థంకాలేదు. ఎటు చూసినా, ఆ ముళ్ళ పొదల్లోంచి, తుప్పల్లోంచి చీమల బారుల్లా దార్లు కనపడుతున్నాయి. అందుకే నా ప్రక్కనున్న అతన్ని ఉద్దేశించి 'అయ్యా' అన్నాను.

ఏంటో చెప్పండన్నట్టు చిరునవ్వుతో చూశాడు.

'శ్రీ షిరిడీసాయి అనాథాశ్రమానికి ఎటు వెళ్ళాలి?' అడిగాను.

'జట్కా వస్తుంది, కాస్సేపు ఉండండి' అన్నాడతను ముక్తాయింపుగా.

'తమరు కూడా' అని నా సంశయాన్ని వ్యక్తం చేసేలోగానే,

'అవును, నేనూ ఆశ్రమానికే వెళుతున్నాను. నా సహోద్యోగి భార్య ఇక్కడుంటేను చూసిపోడానికని వచ్చాను' అన్నాడతను.

'సహోద్యోగి భార్యా!'

'అదే నే సర్వీసులో ఉండగా, నాతో ఖరగ్‌పూర్‌లో పని చేస్తూ ఉండేవాడు. అతడు ఈ మధ్యే పదవీ విరమణ చేశాడు. ఆ డబ్బులొచ్చి పట్టుమని పదిరోజులైనా గడిచాయో లేదో, అతడు గుండెపోటుతో మరణించాడు. పాపం వంటరి ఆడది. వెర్రిబాగులది. అందుకే ఏమీ సహాయం చేయలేని స్థితిలో ఈ ఆశ్రమంలో చేర్పించాను. అడపాదడపా వచ్చి చూసిపోతూంటాను' అన్నాడు.

'అయ్యో పాపం! ఆమెకి పిల్లలుగాని, వెనకా ముందు గాని ఎవ్వరూ లేరాండి?' అడిగింది శ్రీమతి జాలిగా.

'పిల్లలు మచుకు లేరమ్మా. ఇక వెనకా ముందు అంటే ఉన్నారు. కాని చాలా ఏళ్ళుగా ఖరగ్‌పూర్‌లోనే ఉండిపోవడంవల్ల, రాకపోకలు తక్కువై, ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా కరువవటంతో. బంధువర్గానికి దూరమయ్యారు. అలా అని బంధువర్గం నుండి విడిపోవటం కాదు. పెళ్ళిళ్ళకి, పేరంటాలకి కబురు కంపుతూ ఉండేవారు. కబుర్లు కూడా అలా దూరంగా ఉంటే బాగుండేది' అన్నాడతను.

'అదేంటండీ. ఇలాంటి సమయాల్లో దూరంగా ఉండటం కంటే దగ్గరవటం మంచిదేగా?' అంది శ్రీమతి.

'ఏం మంచిది లెండి? అతడు చనిపోయేవరకు దూరం తీరాల్లా ఉన్న బంధువర్గమంతా, రాకపోకలు మొదలెట్టి. ఆమెకు చేరువై, తమ తమ పిల్లల్ని దత్తత చేసుకోమంటూ ఆమెపై వత్తిడి చేశారట. ఆమె ససేమిరా కాదనటంతో, ఇప్పుడు ఆస్తిని తమ పేర రాయమంటూ వైషమ్యానికి దిగటంతో భయపడి నన్ను వెతుక్కుంటూ నా సహాయం కోసం నా దగ్గర కొచ్చేసింది.'

'నేనేమో. సొంత గూడంటూ ఏర్పాటు చేసుకోలేక, ఈ ఊరు కాదని ఆ ఊరు. ఆ ఊరు కాదని ఈ ఊరు, పిల్లల దగ్గరికి ఫుట్‌బాల్‌లా గెంతుకు పోతున్నవాడ్ని. ఇలాంటి స్థితిలో వున్న నేను, అటువంటి పరిస్థితుల్లో ఉన్న ఆమెను, నా దగ్గర ఎలా అట్టే పెట్టుకోను. అందుకనే ఆమెను ఈ ఆశ్రమంలో అట్టేపెట్టి, అడపాదడపా వచ్చి చూసి పోతూంటాను. చూశారా? కలికాల మహిమ. ఓ పక్క న్యాయం ధర్మం కోసం పోరాడుతున్న మనిషి, మరోపక్క తన స్వార్థం కోసం ఆటవిక న్యాయాన్ని, జంతు ధర్మాన్ని ఎలా పాటిస్తున్నాడో!' అన్నాడతడు.



అతడు చెప్పేదాన్ని వింటూ, అతడన్న దాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించేలోగా జట్కా రావటం, మేం ఆశ్రమానికి చేరుకోవటం జరిగిపోయింది.

వెళ్ళి విజిటర్స్ బుక్‌లో పేరు, చిరునామా రాసి సంతకం చేశాం. గ్రౌండ్‌లోంచి, హృదయానికి హత్తుకునేలా పారవశ్యంతో ఆలపిస్తున్న భక్తి పాటలు వినబడుతుండటంతో 'ఈ టైంలో ప్రేయరేంటి విచిత్రంగా' అని అడిగాను.

'ఒకరు చనిపోయారు. సమాధి చేసే ముందు వారి ఆత్మశాంతికై ప్రార్థన జరపడం ఇక్కడ ఆనవాయితీ. అందరూ ఆ ప్రార్థనకి తప్పకుండా హాజరవ్వాలి కూడా. పదండి మనం కూడా ప్రార్థనలో పాల్గొని వద్దాం' అని ఆశ్రమ నిర్వాహకుడు చెప్పడంతో అటుగా బయల్దేరాం.

అక్కడ నూట యాభై మంది వరకు ప్రార్థనలో పాల్గొన్నట్లున్నారు. చివరి వరసలో కూర్చున్నాం. నా మనసు ప్రార్థన మీద లగ్నం కావడం లేదు. ఆ వాతావరణాన్ని చూశాక, నా మనసెందుకో మొద్దుబారినట్లు అన్పిస్తోంది. నే వచ్చిన పని ముగించుకొని త్వరగా బయటపడాలనిల్పి ఆత్రుత అధికమవటంతో



'ఓయ్! ఆమె ఎక్కడుందో చూడు. వెంటనే పలకరించేసి బయల్దేరుదాం' అని శ్రీమతి చెవిలో గొణిగాను.

'ఏమోనండి. నాకేం కన్పడటంలేదు. మీకేమన్నా కన్పడితే చెప్పండి' అంటూ తనూ నా చెవిలో గొణిగింది.

ఆమె జాడ కన్పించడంలేదు. ఆమెను ఎంత త్వరగా చూసి తిరుగు ప్రయాణం కడదామా అన్పిస్తోంది. నా ఆలోచనలన్నీ ఆమె చుట్టూనే తిరుగుతున్నాయి.

ఆమె కుటుంబం, మా కుటుంబం ఒకే కొంపలో చెరో వాటాలో అద్దెకు ఉండేవాళ్ళం. ఆమె భర్త నిరుద్యోగే అయినా మంచి ఆర్టిస్టు. అతడు వేసే బొమ్మల్ని చూసి, ఆమె అతడ్ని ప్రేమించి పెళ్ళాడిందట. అతడు గీసే బొమ్మలు బాపు బొమ్మలకు దీటుగా ఉండేవి. అయితేనేం, వొట్టి వ్యసనపరుడు. ఏ రోజు సంపాదన ఆ రోజే ఖర్చయ్యేది.

ఆమె మాత్రం మహాలోభి. దుబారా అన్నా, లగ్జరీ అన్నా పిల్లల మీద భర్త మీద విరుచుకుపడేది. ఎంగిలి చేత్తో కూడా కాకిని తోలడానికి ఇష్టపడేది కాదు. భర్త వ్యసనపరుడు కావడంతో ఆ ఇంట్లో ప్రతీరోజూ ఒక మహాసంగ్రామం జరిగేది. ఆ సంగ్రామం, ఆమె లోభితనం, ఆ ఇంటిని అప్పుల బారి నుండి కాపాడేది. చేసేది నర్సు ఉద్యోగమే అయినా ఇంట్లో డబ్బుకి లోటుండేది కాదు. అలాగని అడ్డదార్లు తొక్కే అలవాటు కూడా లేదామెకు. ముక్కుకు సూటిగా పోయే తత్వం ఆమెది.

ఎన్ని మంచి లక్షణాలున్నా, ఆమెకు ఆడపిల్లలంటే ఎందుకో చిన్నచూపు. ఆమె కోరుకున్నట్లే ఆమెకు ముగ్గురూ కొడుకులే. మాకు పిల్లల్లేరు. అందుకని నేను ఇద్దరు ఆడపిల్లల్ని పెంచుకుంటున్నాను. 'కంటే ఖర్మం గాని, పెంచుకుంటే ప్రారబ్దమా' అని ఈ 'జడ' పదార్థాలని ఎందుకు అంటగట్టుకున్నారో అర్థం కావడంలేదు అనేది. అంతేనా, మైనస్ బ్రదర్ అంటూ నన్ను ఆటపట్టిస్తూ వుండేది.

ఆడపిల్లలు అందించే అనురాగం గాని, కురిపించే అభిమానంగాని, తినిపించే మమకారం గాని, ఆడపిల్లలకున్నంతగా మగపిల్లల్లో ఉండదు. ఆడపిల్లంటే మైనస్ కాదు, పురుషుని కలిమిలో కంటే లేమిలోను, సుఖాల్లో కంటే కష్టాల్లోనూ ఆత్మీయతను పంచిపెట్టడానికి, భగవంతుడు నుండి పురుషుడి పొందిన దివ్యమైన వర రూపం అని ఎంత చెప్పినా ఒప్పుకునేది కాదు. తనూ ఆడదే అన్న విషయం మర్చిపోయి వాదించేది. స్త్రీకి స్త్రీయే శత్రువన్న సామెత ఆమెతో రుజువైంది.

తన పిల్లల్ని పెద్దపెద్ద చదువులు చదివించాలని మంచి ఉద్యోగాల్లో చూడాలని, ఇక్కడ తను సంపాదిస్తున్నది చాలదని, సౌదీలో ఉన్న తన బంధువుల ద్వారా అక్కడ నర్సు ఉద్యోగం సంపాదించుకొని, తను సౌదీ వెళ్ళిపోయింది. పిల్లల చదువు కోసమని హైదరాబాద్ మకాం మార్చారు. ప్రతీ ఐదేళ్ళ కొకసారి వచ్చినా, ఇరవై సంవత్సరాలపాటు వాళ్ళకి దూరంగా భారంగా బతుకును నెట్టుకు వచ్చింది. ఆమె కోరుకున్నట్లే ఇక్కడ పిల్లలు ప్రయోజకులై ఎవరో త్రోవ వారు చూసుకొని, ఎవరి పెళ్ళిళ్ళు వారు చేసుకొని వెళ్ళిపోయారు. తన సంపాదన పిల్లల పురోగమనానికి, వారి విలాస జీవితానికి, భర్త వ్యసనాలకి ఉపయోగపడింది.

ఈ జెట్ యుగంలో కాలంతో పోటీపడి పరిగెత్తుతున్న యువతలో అనుబంధాలకు, ఆప్యాయతలకు కాలం చెల్లిపోతోంది. ప్రతీ విషయాన్ని వ్యాపార దృష్టితో చూస్తూ ఎవరి అభివృద్ధి వారు చూసుకుంటున్న తరుణంలో; వయసు పైబడి, వడలిపోయిన ఎండుటాకు లాంటి ఆమె ఎవరికి అవసరమౌతుంది?

తల్లితోగల అనుబంధం ఎలాంటిదో తెలియబోయే వయస్సులో, తల్లి అందించే మమకారం ఎటువంటిదో తెలియబోయే వయస్సులో ఆమె పిల్లలకు దూరమైంది. ఇప్పుడు తను వాటి కోసం ఎంత ప్రాకులాడితే మటుకు



ఆడపిల్లలు అందించే అనురాగం గాని, కురిపించే అభిమానంగాని, తినిపించే మమకారం గాని, ఆడపిల్లల కున్నంతగా మగపిల్లల్లో ఉండదు. ఆడపిల్లంటే మైనస్ కాదు. పురుషుని కలిమిలో కంటే లేమిలోను, సుఖాల్లో కంటే కష్టాల్లోనూ ఆత్మీయతను పంచిపెట్టడానికి, భగవంతుడు నుండి పురుషుడి పొందిన దివ్యమైన వర రూపం అని ఎంత చెప్పినా ఒప్పుకునేది కాదు.

పిల్లల్నుండి పొందగలదు. భర్త నుండి సరేసరి. ఇన్నాళ్ళుగా వారు ఆమెను ఓ డబ్బు యంత్రంగానే భావించారు. అష్టకష్టాలు అనుభవించి, అన్ని రోగాలకు ఆలవాలమై సౌదీ నుండి పూర్తిగా తిరిగొచ్చాక గాని, తనకి జ్ఞానోదయం కాలేదు. డబ్బు పంచి ప్రయోజకుల్ని చేసిందే గాని, మనసు పంచి తన వారిని చేసుకోలేకపోయింది. చెదురుమదురై తనని పట్టించుకోని పిల్లలు, డబ్బుతోనే ముడిపడి వున్న భర్త ప్రవర్తనలతో విసిగి. చివరి దశలో కావాల్సిన అనురాగం, ఆప్యాయతలకు అర్రులు చాచి, వారి నుండి పొందలేక భంగపడి ఈ ఆశ్రమంలో చేరింది.

తన బాధలను వెళ్ళగక్కుతూ చాలాచాలా ఉత్తరాలు రాసింది, ఈ ఆశ్రమానికి వచ్చాక కూడా. మిమ్మల్ని చూడాలని ఉంది, రమ్మని కూడా రాసింది.

ఆడపిల్లల తండ్రిని, వారి చదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, పురుళ్ళు, పుణ్యాలు వగైరా నెరవేర్చేసరికి నే రిటైరయ్యాను. నాకో గూడంటూ చూసుకొని నా పిల్లల అవసరాలకి ఉడతా భక్తిగా సాయపడ్తూనే ఉన్నాను. వాళ్ళ అవసరాలు, దృక్పథాలు నెరవేరాలంటే ఇంకా నా సాయం తప్పనిసరి.

కాని, ఇంకెన్నాళ్ళు నాన్నా, మా కోసం తాపత్రయపడతారు. ఇక విశ్రాంతి తీసుకోండి, అని పిల్లలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేటప్పటికి ఇదిగో రెండేళ్ళు పట్టింది. ఇక నుండి ఖాళీయేగా. తరచూ వెళ్ళి వస్తూండాలి అని నిర్ణయించుకొని. ఆమెకు ఉత్తరం కూడా రాశాం.

ప్రార్థన పూర్తయింది. విజిటర్స్ హాల్లోకి తిరిగి వచ్చి ఎవరు కావాలో, మేము ఎక్కడ నుండి వచ్చామో వివరాలతో దరఖాస్తు నింపి నిర్వాహకునికి ఇచ్చాం.

అతను దాన్ని పరిశీలనగా చూసి, 'అదేంటండి. ఈమె చనిపోయిందిగా. ఆమె ఆత్మశాంతి కోసమే మనం ప్రార్థన జరిపి వస్తున్నాం. ఆమెను సమాధి చేయడానికి తీసుకువెళ్తున్నారు. త్వరగా వెళ్ళగలిగితే ఆఖరి చూపులకు నోచుకోగలరు' అన్నాడతను ఆతృతగా.

కార్యక్రమాలు పూర్తయ్యాక ఇంటికి చేరాం. తలవని ఈ సంఘటనకి ఒకంతటికి మనుషులం కాలేకపోయాం. మరో రెండ్రోజులనాడు ఆమె రాసిన ఉత్తరం ఒకటి అందింది. దాని సారాంశం ఇలా ఉంది.

'పరాయి పంచన చేరు కూతుర్ల కంటే, నా వల్ల జీవం పోసుకొని నా నీడన బ్రతికే కొడుకులే నన్ను ఉద్ధరిస్తారన్న పిచ్చి భ్రమలో ఉండేదాన్ని. ఆ భ్రమల పొరలు తొలగేసరికి మృత్యువుకు చేరువలో ఊగిసలాడుతూ ఉన్నాను. కనకపోయినా ఆడపిల్లల్ని పెంచుకున్న అదృష్టవంతులు మీరు' అని ఉంది.

వస్తున్న దుఃఖాన్ని ఆపుకొని, మనసు గట్టి చేసుకోడానికి ప్రయత్నిస్తున్నా, నా పెద్దకూతురి ఓదార్పుతో.

★

